నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 27 జనవరి 2025 RANGAREDDY


కేశంపేట : లబ్ధిదారులకు రేషన్‌కార్డు ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న అధికారులు

# మొక్కుబడిగానే..

- రంగారెడ్డి జిల్లాలోని 21 గ్రామాల్లో నాలుగు పథకాల పంపిణీ షురూ
- ఐదు నుంచి పది మందికే పథకాల పత్రాలు అందజేత
- మిగిలిన లబ్ధిదారులకు ఎప్పుడో స్పష్టత కరువు
- సంక్షేమ పథకాలు అందరికా.. కొందరికా అంటూ ప్రశ్న
- అయోమయంలో ప్రజలు

రంగారెడ్డి, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డు, రైతు భరోసా పథకాల పంపిణీ మొక్కుబడిగానే సాగింది. రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవాన్ని పుర స్కరించుకుని ఆదివారం జిల్లాలోని 21 గ్రామాల్లో పై నాలుగు పథకాలను అట్టహాసంగా ప్రారంభించింది. ఆయా గ్రామాల్లోని రైతులు, మహిళలు తమకు ప్రభుత్వ పథకాలు వస్తాయని ఎంతో ఆశగా ఎదురుచూడగా.. పంపిణీ మాత్రం కొందరికే సాగింది. ఐదు నుంచి పదిమంది లబ్ధిదారుల కు మాత్రమే అధికారులు పత్రాలను అందజేశారు. మిగిలిన వారికి, మిగిలిన గ్రామాల్లోని అర్హులకు పత్రాలను ఎప్పుడు పంపిణీ చేస్తారో స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. సంక్షేమ పథకాలు అందరికా..కొందరికా..? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నా రు. జిల్లాలో మొత్తం 549 గ్రామ పంచాయతీలు, 21 మండలాలు, 13 మున్సిపాలిటీలు, రెండు కార్పొరేషన్లు ఉన్నాయి. వీటి పరిధుల్లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల జరిగిన గ్రామ, వార్డు సభల్లో నాలుగు పథకాలకు దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాలను ప్రకటించారు. అయితే ఆ జాబితాలు ఫైనల్ కాదని.. వాటిపై విచారణ జరిపి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. కాగా అర్హులను ఎప్పుడు ఎంపిక చేస్తారో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

# అనర్హులకు ఆత్మీయ భరోసానా?


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాశీంపూర్ గ్రామస్తులు

- ఇది ఎంత వరకు సమంజసం
- తాండూరు ఎమ్మెల్యే ఎదుట మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అసహనం
- అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ

బషీరాబాద్, జనవరి 26 : అనర్హులకు ఆత్మీయ భరోసా ఇవ్వడం ఎంత వరకు సమంజసమని.. మా గ్రామంలో బయటి లీడర్ల పెత్తనం ఏమిటని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ తాండూరు ఎమ్మెల్యే మనో హర్‌రెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన కాశీంపూర్ గ్రామంలో ఆదివారం ప్రభుత్వ పథకాల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దీనికి వచ్చిన ఎమ్మెల్యేతో శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డికి గుంట భూమి కూడా లేదని, అతడికి పక్షవాతం వచ్చి రెండేండ్లు అవుతున్నదని.. అతడి భార్య ఉపాధి హామీ పనికి వెళ్తున్నదన్నారు. వారి కుటుంబం ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక కాలేదన్నారు. కొంత మంది అనర్హులకు ఆత్మీయ భరోసా జాబి తాలో పేర్లు వచ్చాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా శ్రీనివాస్ తిరిగి వెళ్లే క్రమంలో తాండూరుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి వెనుక నుంచి ఓయ్ ఓయ్ అని కేకలు వేయడంతో శ్రీనివాస్ తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేశారు. సమస్యను ఎమ్మెల్యేకు వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. మధ్యలో మీ పెత్తనం ఏమిటని సదరు నాయకు డిపై విరుచుకుపడ్డాడు. బయటి లీడర్లు మా గ్రామంలో పెత్తనం చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే కార్యక్రమం నుంచి వెళ్లిపోగానే.. పేదలకు కా కుండా ఇష్టం వచ్చిన వారికి పథకాలను అందిస్తున్నారని గ్రామస్తులు అధికారులపై మండిపడ్డారు.


వికారాబాద్ కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి తదితరులు

## జిల్లాను ప్రగతి పథంలో
# నిలుపుదాం..

- పథకాల అమలుకు ప్రజలందరూ సహకరించాలి
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్
- గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో జాతీయ జెండావిష్కరణ
- అమరవీరులు, రాజ్యాంగ నిపుణులకు ఘన నివాళి
- ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అవార్డుల ప్రదానం
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

వికారాబాద్, జనవరి 26 : జిల్లాను ప్రగతిపథంలో నిలిపేందుకు సహకరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం 76వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ కలెక్టరేట్ ఆవరణలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ...ప్రపంచంలోనే గొప్ప సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర దేశంగా నిలుపుకొనేందుకు అంబేద్కర్ సారథ్యంలో భారత రాజ్యాంగాన్ని 1950 జనవరి 26న అమల్లోకి తెచ్చుకున్నామన్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన అమరవీరులు, రాజ్యాంగాన్ని రూపొందించిన రాజ్యాంగ నిపుణులకు కలెక్టర్ జోహార్లు అర్పించారు. రేవంత్ ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో ముందున్నదని.. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా అమలు చేస్తున్నదన్నారు. జనవరి 26 నుంచి ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, రైతుభరోసా వంటి పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తామన్నారు. 1 మార్చి 2024 నుంచి గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లుల జారీ ప్రారంభం అయ్యిందని, జిల్లాలో జూన్ నుంచి ఇప్పటివరకు 1,36,000 మంది వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడం జరిగిందని, ఇందుకోసం ప్రభుత్వం రూ.30.06 కోట్లను చెల్లించిందన్నారు. మహాలక్ష్మి పథ కం కింద జిల్లాలో 1,17,000 మంది లబ్ధిదారులకు 2,82,000 గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశామని.. ఇందుకు ప్రభుత్వం రూ.7.36 కోట్ల గ్యాస్ సబ్సిడీ భరించిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఇప్పటివరకు మహిళలు, ట్రాన్స్‌జెండర్లు 2.70 కోట్ల మంది వినియోగించుకున్నార న్నారు. జిల్లాలో రుణమాఫీ పథకం కింద లక్షా 358 మంది రైతన్నలకు రూ. 849.30 కోట్ల రుణాలను చెల్లించామని, రైతులకు మద్దతు ధర చెల్లించేందుకు జిల్లాలో 126 ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటుచేసి ఖరీఫ్‌లో 51,784 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రూ. 120 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని వివరించారు. అదేవిధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కవరేజీని రూ. ఐదు నుంచి రూ. పది లక్షలకు పెంచామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో భాగంగా జిల్లాలోని 1,062 పాఠశాలల్లో 924 బడుల్లో అన్ని రకాల పనులను పూర్తి చేయించామని, ఇందుకు రూ.17 కోట్ల 55 లక్షలు వెచ్చించామని ఆయన వివరించారు. ఈ గణతంత్ర దినోత్సవ రోజున రెసిడెన్షియల్ స్కూల్ పిల్లల కోసం 'మూవీ క్లబ్'ను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది 670 అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.కోటీ31 లక్షలతో మరమ్మతులు చేయించామని, ఉపాధి హామీ పనుల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో ఉన్నదని.. ఇందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. స్త్రీ నిధి బ్యాంకు ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.43 కోట్ల 92 లక్షల రుణాలు, 4,555 పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా ఇప్పటివరకు రూ. 404 కోట్ల 83 లక్షల రుణాలను ఇచ్చామన్నారు. గణతంత్ర వేడుకల్లో కొత్తగడి బాలికల గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మోమిన్‌పేట, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల బండివెనుకచర్ల, మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సంఘం లక్ష్మీబాయి పాఠశాల విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు కలెక్టర్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శం కర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.




విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు..

- అందరికీ పథకాలు అందించేందుకే సమగ్ర కుటుంబ సర్వే..
- జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో జాతీయ జెండావిష్కరణ
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శనలు
- ఆకట్టుకున్న వైద్యారోగ్య శాఖ శకటం..

రంగారెడ్డి, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఆదివా రం 76వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. జిల్లా సమగ్రాభివృద్ధితోపాటు పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామని.. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించామన్నారు. 5,376 మంది ఎన్యూమరేటర్లతో 5,62,598 కుటుంబాల సమగ్ర సమాచారాన్ని సేక రించామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రక్రియలో భా గంగా ఆదివారం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి నాలుగు పథకాలను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం ఎకరానికి ఏడాదికి రూ.12,000 చెల్లిస్తుందని, అదేవిధంగా భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000 ఇందిరమ్మ ఆత్మీయ భరో సా పథకం కింద పంపిణీ చేస్తుందని వివరించారు. అలాగే అర్హులందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు సర్కారు చర్యలు తీసుకున్నదన్నారు. గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇండ్లు నిర్మిం చుకునేందుకు సహకరిస్తుందన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, వ్యవసా యం, రైతుబీమా, ఆయిల్‌పామ్ సాగు, వన మహోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ చేయూత వంటి కార్యక్రమాల ద్వారా పేదలందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.




కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తదితరులు

### స్టాళ్లను ప్రారంభించిన కలెక్టర్..

గణతంత్ర వేడుకల సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించి వాటి ప్రాధాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. గృహనిర్మాణం, గ్రామీణాభివృద్ధి, మహిళా పొదుపు సంఘాలు, అల్లికలు, ఉద్యానవనం వంటి స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించారు.



### జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు..

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పలు ప్రణాళికలను రూపొందిస్తున్నదని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో నాల్గో అత్యాధునిక పట్టణాన్ని రూపొందిం చే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కందుకూరు మం డలంలోని పంజాగూడ సమీపంలో ఫోర్త్‌సిటీ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయన్నారు. ఫోర్త్‌సిటీకి కనెక్టివిటీ పెంచేందుకు కొం గరకలాన్ నుంచి ఫోర్త్‌సిటీ వరకు ఓ రోడ్డు, ట్రిపుల్‌ఆర్ నుంచి ఫోర్త్‌సిటీకి మరో రోడ్డును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే, జిల్లాలో ఐటీ పరిశ్రమలు, వివిధ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వ పరంగా సహకరి స్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, డీఈవో సుశీందర్‌రావు, డీపీవో సురేశ్‌మోహన్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, ఆర్డీవోలు, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పోలీసుల కవాతు

### సాంస్కృతిక కార్యక్రమాలు అదుర్స్

కలెక్టరేట్‌లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇబ్రహీంపట్నం గురుకుల కళాశాల, కందుకూరు కేజీబీవీ పాఠశాల, తుక్కుగూడ, రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, పాలమాకుల ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాజేంద్రనగర్ మైనార్టీ కళాశాలకు చెందిన విద్యార్థుల దాండియా నృత్యం, మహేశ్వరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల గిరిజన నృత్యం ఎంతగానో ఆకట్టుకున్నాయి. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు అందించి సత్కరించారు.

### ఆకట్టుకున్న వైద్యారోగ్య శాఖ శకటం..

జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలను గణతంత్ర వేడుకల్లో ప్రదర్శించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ శకటం అందరినీ ఆకట్టుకున్నది. గుండెనొప్పితో పడిపోయిన ఓ వ్యక్తికి సీపీఆర్ చేస్తూ నిర్వహించిన శకటం కన్నులను కట్టి పడేసింది. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటం ముందు ఓ వ్యక్తికి సీపీఆర్ చేస్తున్నట్లుగా ప్రదర్శించారు. అలాగే, డీఆర్‌డీఏ, ఆర్టీసీ, ఫిషరీస్ వంటి శాఖలు తమ శకటాలను ప్రదర్శించాయి.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సంక్షేమ పథకాలు షురూ.. లోపలి పేజీల్లో..